క్లుప్తంగా

శనీశ్వరస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకారంలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శ్రీశనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలా లతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పట్టుపీతాంబరాలు, విశేష పుష్పమాలికలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వయోవృద్ధులకు పింఛన్ల అందజేత


బీఎన్‌కండ్రిగ: పింఛన్ అందజేస్తున్న కార్యదర్శి ఇందిరమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. బుచ్చినాయుడుకండ్రిగ, కంచన పుత్తూరు, గ్రామాల్లో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పింఛన్లు అందజేశారు. మిగిలిన వారికి డీబీటీ ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో నగదును జమచేశారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా త్రివిక్రమ్‌రావు



బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ ఇన్‌చార్జ్ అభివృద్ధి అధికారిగా కార్యాలయ ఏఓ త్రివిక్రమ్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గా త్రివిక్రమ్‌రావును నియమిస్తూ జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

కరెంటు షాక్‌తో గేదె మృతి

పిచ్చాటూరు: కరెంటు షాక్‌తో గేదె దుర్మరణం చెందిన సంఘటన శనివారం పిచ్చాటూరులో చోటు చేసుకుంది. యజమాని శెల్వమురుగన్ గేదెలను మేత కోసం మునీశ్వర ఆలయం సమీపంలోకి తీసుకెళ్లాడు. ఒక గేదె నీరు తాగేందుకు పక్కనే ఉన్న అరణియార్ కాలువలో దిగింది. అప్పటికే కాలువలో విద్యుత్ తీగ తెగి వేలాడుతుండడంతో షాక్ తగిలి గేదె గిలగిలా కొట్టుకుంటుండగా అక్కడివారు గుర్తించారు. విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి సరఫరాను ఆపించి గేదెను కాలువ నుంచి వెలికి తీశారు. గేదె అప్పటికే మృతి చెందింది. స్థానిక పోలీసులు, విద్యుత్ అధికారులకు బాధితుడు సమాచారం అందించాడు. రూ.40 వేలు విలువ చేసే గేదె మరణించడంతో తమ కుటుంబం వీధిన పడినట్లు అయ్యిందని, ఆదుకోవాలని కోరారు.

ఒకే ఈతలో రెండు పేయ దూడలు



ఏర్పేడు: సాధారణంగా ఆవులు ఒక ఈతలో ఒక దూడకు జన్మనిస్తాయి. మండలంలోని పాగాలిలో రైతు పెంచలరెడ్డికి చెందిన ఆవు ఒకే ఈతలో రెండు పేయ దూడలకు జన్మనిచ్చింది. ఒకే ఈతలో రెండు దూడలు ఈనడంతో రైతు హర్షం వ్యక్తం చేశాడు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో వచ్చి ఆసక్తిగా తిలకించారు.

నలుగురు దొంగల అరెస్ట్

డక్కిలి : సెల్ టవర్ బ్యాటరీలను చోరీ చేసిన నలుగురు దొంగలను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ చౌడయ్య తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తీర్థం పాడు గ్రామం వద్దనున్న బీఎస్ఎన్ఎల్ టవర్‌లో జియోకు సంబంధించిన 48 బ్యాటరీలను గతనెల 29న చోరీకి గురయ్యాయి. జియో టవర్ జేటీవో సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. శనివారం డక్కిలి మండలం మోపూరు సెంటర్ వద్ద నెల్లూరు జిలా కోవూరు వెంకటేశ్వపురం ప్రాంతానికి చెందిన దారా నవీన్, షేక్ అజీ, సయ్యద్ అయఫ్‌బాషా, షేక్ జాఫర్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కండలేరులో 6.621 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.621 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాంబంటు..నీవే శరణమంటూ..


బీఎన్‌కండ్రిగ: ప్రత్యేక అలంకరణ


బీఎన్‌కండ్రిగ: పల్లమాలలో..



శ్రీకాళహస్తి : విశేషాలంకారంలో ఆంజనేయస్వామి, పూజల్లో పాల్గొన్న చైర్మన్, ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అచ్యుతరాయ మండపంలో వెలసిన శ్రీఆంజనేయ స్వామి వారికి శనివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రకా ల అభిషేక పూజల అనంతరం ఆయోధ్య రాముని రూపంలో స్వామివారిని అలంకరించారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసు లు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారు లు నాగభూషణం, హరియాదవ్, వేదపండితులు మారుతిశర్మ, అర్చకులు తులసీశర్మ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, కంచనపుత్తూరు, జోగికండ్రిగ, కల్లివెట్టు, పల్లమాల గ్రామాల్లో శ్రీహనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అభిషేక పూజలు, విశేష అలంకరణల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీఅంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామాల్లో ఊరేగించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సత్యవేడులో..

సత్యవేడు: స్థానిక అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి, మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాలాభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.




పిచ్చాటూరు: కీళపూడి ఆలయ పూజల్లో భక్తజనం, కీళపూడిలో భక్తుల పాలాభిషేకం, నాగలాపురం : ఆంజనేయస్వామి ఊరేగింపు

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడి శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయం, సిద్ధిరాజుకండ్రిగ శ్రీ హనుమతీశ్వరాలయంలో హనుమజ్జయంతి వేడు కలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కీళపూడిలో భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కోలాట భజనలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సిద్ధిరాజుకండ్రిగ సోమనాథేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిగా యి. అన్నదానం చేశారు. గ్రామోత్సవం జరిగింది.

నాగలాపురంలో..

నాగలాపురం: పట్టణంలోని గాంధీవీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. జై హనుమాన్ నినాదాలతో ఆలయం మార్మోగింది. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. రాత్రి 7 గంటలకు ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగన కర్పూర హారతులు సమర్పించారు.

తొట్టంబేడు మండలంలో..

తొట్టంబేడు : తొట్టంబేడు పంచాయతీ బంగారమ్మ కాలనీలో వెలసిన శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. కొణతనేరి మార్గంలో వెలసిన శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెంలో వెలసిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో, ఆంజనేయ పురం వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బండారుపల్లి, ఇసుకతాగేలి, పరమాలపల్లి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాల అనంతరం విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ప్రసాదాలు అందజేశారు.


తొట్టంబేడు : విశేష అలంకరణ


బండారుపల్లెలో ప్రత్యేకాలంకరణ

అల్లర్లను ప్రేరేపిస్తే కఠిన చర్యలు


సూచనలిస్తున్న ఎస్‌ఐ వెంకటనరసింహం

బుచ్చినాయుడుకండ్రిగ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఫలితాల నేపథ్యంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. ఆయన శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, మైక్ ద్వారా ఎన్నికల నిబంధనలను తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడదన్నారు. ఒక పార్టీని కించపరిచే విధంగా మరో పార్టీ నాయకులు మాట్లాడ కూడదని, అల్లర్లకు పాల్పడినా, బాణసంచా కాల్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయోత్సవ ర్యాలీలు నిషేధమని, నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీసీ గురుకులాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

కోట : జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ కె.నారాయణరావు శనివారం తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాల కోసం 9441215108 లో సంప్రదించాలన్నారు.

మిగులు సీట్ల భర్తీకి 7న ప్రవేశ పరీక్ష

తడ: మండలంలోని అక్కంపేటలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి 7వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సౌజన్య తెలిపారు. ఆసక్తి కల విద్యార్థులు 7వ తేదీ ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్ వద్ద జరిగే పరీక్షకు హాజరుకావాలని కోరారు.

ఘనంగా అగ్నిగుండ మహోత్సవం


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

నాగలాపురం: పట్టణంలోని వీకే వీధిలో వెలసియున్న శ్రీకావమ్మ సమేత మారయ్య ఆలయ తిరుణాళ్లలో భాగంగా మూడవ రోజు శనివారం వేకువజామున 4-30 గంటలకు అగ్నిగుండ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత కలశ, మహా హోమ పూజలు నిర్వహించారు. కంకణాలు ధరించిన 250 మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అశేష భక్తులు శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు జె.గోవిందుడు, చెంగల్ రాయులు, ఆర్‌వీ రమణయ్య, నాగరాజు, దేవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఐలు, సంఘం నాయకులు

గూడూరు రూరల్ : పనులు చేసుకునే కూలీలు ఎండ తీవ్రతను తట్టుకునేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని గూడూరు రెండో పట్టణ, రూరల్ సీఐలు రవికిరణ్, వేణుగోపాల్ రెడ్డి సూచించారు. రెండో పట్టణంలోని కోర్టు సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 500 మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. సీఐలు మాట్లాడుతూ రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్నాయని తెలిపారు. మజ్జిగ, మంచి నీరు ఎక్కువగా తాగాలని సూచించారు. బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్, కార్యదర్శి, కోశాధికారులు చిట్టమూరు శ్రీనివాసరావు, లలితమ్మ, బి.శ్రీనివాసరావు, నరసింహన్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న వేరుశనగ

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా అంతరాయంతో వేరుశనగ ఎండిపోతుందని రైతులు ఆందోళనచెందుతున్నారు. కోబాక ఫీడర్ కింద వారం రోజులుగా వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా కొరత ఏర్పడింది.దీంతో వేరుశనగకు సాగునీరు అందక సుమారు 50 ఎకరాలల్లో పంట ఎండుతోందని రైతులు అంటున్నారు. సమస్యపై ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్యను వివరణ కోరగా కొన్ని సాంకేతిక కారణాలతో రెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గిందని, శనివారం సక్రమంగా విద్యుత్ సరఫరా చేసినట్లు ఏఈ తెలిపారు.

రేణిగుంటలో వర్షం

తొట్టంబేడు/ రేణిగుంట : తొట్టంబేడు, రేణిగుంట మండలాల్లో శనివారం రాత్రి 10 గంటల సమయంలో మోస్తరు వాన కురిసింది. నాలుగు రోజులుగా అధిక ఉష్ణోగ్రతతో అల్లాడుతున్న ప్రజలకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగింది. ఉరుములతో కూడి వర్షంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

హథీరాం బావాజీ ఆలయంలో భోగ్‌భండార్

తిరుపతి రూరల్: మండలంలోని వేదాంతపురంలో నూతనంగా నిర్మించిన శ్రీహథీరాం బావాజీ ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా శనివారం రాత్రి భోగ్‌భండార్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి బంజారా సాంప్రదాయ పద్ధతిలో భోగ్ భండార్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మామండూరులో గజరాజుల బీభత్సం

- మామిడితోటల్లో విధ్వంసం
- భయాందోళనలో రైతులు

రేణిగుంట: మండలంలోని మామండూరు గ్రామ శివార్లలోని మామిడి తోటల్లోకి శుక్రవారం రాత్రి 5 ఏనుగుల గుంపు చొరబడి ఘీంకార శబ్దాలతో చెట్లు కొమ్మలు విరిచి, నానా బీభత్సం సృష్టించాయి. దాదాపు 25 ఎకరాల్లో కాపునకు వచ్చిన మామిడి తోటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. శుక్రవారం సాయంత్రమే ఒక ఏనుగు శేషాచల అడవుల నుంచి తోటలోకి ప్రవేశించి కాపరులను తరిమింది. దీంతో కాపలాదారులు భయాందోళనతో గ్రామంలోకి పరుగులు తీశారు.

అనుకున్నదే జరిగింది

సాయంత్రం ఇంటికి చేరుకున్న రైతులు రాత్రికి మరిన్ని ఏనుగులు వచ్చి మామిడి తోటలను నష్టం చేకూర్చుతాయని ఆందోళన చెందారు. సాయంత్రం వచ్చిన ఏనుగు కాసేపటికి మళ్లీ శేషాచలం అడవుల్లో వెళ్లింది. మళ్లీ తోటలోకి చేరుకున్న రైతులు రాత్రి మరోసారి ఏనుగుల అలికిడి గమనించి ఇళ్లకు పరుగులు తీశారు. మొత్తం ఐదు ఏనుగులు ప్రవేశించి చెట్లు, తోటల్లోని బోరు పైపులను ధ్వంసం చేశాయి. గత నెల మొదటి వారంలో ఒకసారి ఇలాగే శేషాచల అడవుల నుంచి ఏనుగుల గుంపు మామండూరు మామిడి తోటల్లోకి వచ్చి చెట్లను ధ్వంసం చేసి భారీగా నష్టం చేకూర్చాయి. మళ్లీ రావడంతో రైతులు పూర్తిగా నష్టానికి గురై రోదిస్తూ వణికిపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించకపోవడం వల్లే తాము తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందజేయాలని కోరుతున్నారు.


మామిడి చెట్లను ధ్వంసం చేస్తున్న ఏనుగు


ధ్వంసం చేసిన పైపులను చూపుతున్న రైతులు

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

పంటల సాగులో విత్తన శుద్ధి కీలకం. సరైన జాగ్రత్తలతో విత్తన శుద్ధి చేస్తే చీడపీడలు, తెగుళ్లను నివారించడంతో పాటు అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మండలంలో సుమారు 3 వేల హెక్టార్లకు పైగా పంటలు సాగు అవుతాయి. వరి, వేరుశనగ, చెరకు, సజ్జ, మొక్కజొన్న, మామిడి, పూల పంటల పైనే రైతులు ఆధారపడుతారు. ఖరీఫ్‌లో అత్యధికంగా వేరుశగన సాగు చేసే రైతులు విత్తన శుద్ధి చేసుకుంటే నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

– పిచ్చాటూరు

- తక్కువ ఖర్చుతో పంటకు రక్షణ
- చీడపీడలు, తెగుళ్ల నివారణ



కీళపూడిలో వేరుశనగ విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సహాయకులు

విత్తన శుద్ధి ఇలా

- కిలో వేరుశనగ విత్తనానికి 3 గ్రాముల బావిస్టిన్ లేదా ఎం.45. లేదా సాఫ్ పొడి కలిపి శుద్ధి చేసుకోవాలి. దీంతో మొలకలు బాగా పెరిగి తెగుళ్లను నివారిస్తుంది.
- విత్తన శుద్ధి తర్వాత మొలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలీంద్రాల నుంచి రక్షణ పొందుతాయి. దీంతో తెగుళ్ల, చీడపీడలు సోకకుండా చూసుకోవచ్చు.
- విత్తన శుద్ధికి తగిన మోతాదులో మాత్రమే మందులు వాడాలి. మోతాదుకు మించి ఉపయోగిస్తే విత్తనం మొలకెత్తే శాతం దెబ్బతింటుంది.
- విత్తన శుద్ధి చేసేటప్పుడు రైతులు ముఖానికి మాస్కులు, చేతులకు బ్లౌజ్‌లు తప్పనిసరిగా వాడాలి.
- విత్తిన తర్వాత 25 లేక 35 రోజుల్లోపు ఆకుపచ్చ తెగుళ్ల సోకకుండా కాంటాఫ్ మందును స్ప్రే చేయాలి.
- 90 రోజులు తర్వాత బావిస్టన్‌ను స్ప్రే చేస్తే ఆకు బలంగా ధృడంగా ఉండి మంచి దిగుబడి వచ్చే అవకాశముంటుంది.

మోతాదుకు మించకూడదు



వేరుశనగ సాగు చేసుకునే ముందు విత్తన శుద్ధి తప్పక చేసుకోవాలి. ఇందుకు తగిన మోతాదులోనే మందులు వాడాలి. పంట సాగు అనంతరం కూడా మోతాదుకు మించి ఎరువులు, మందులు ఉపయోగించకూడదు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకం పెంచాలి. విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పక బిల్లులు పొందాలి. స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో పంట సాగులో సలహాలు, సూచనలు పొందవచ్చు.

– సంజీవ రెడ్డి, ఏఓ, పిచ్చాటూరు

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాపూరు : పెంచలకోన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మొదటి శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 4 అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి కల్యాణం చేశారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు.


కల్యాణం చేస్తున్న అర్చకులు